కథ

# రెండో జీవితం

## కేశిరాజు ఫణిప్రసాద్

ఉదయం ఎనిమిది గంటలు.

నేను, మా బాబాయ్ వరండాలో కూర్చుని కాఫీ త్రాగుతున్నాం.

కాఫీ తాగటం పూర్తయింది.

"అవును బాబాయ్ అర్జంటుగా రమ్మని ఫోన్ చేశావు, ఇంత వరకూ కారణం చెప్పనేలేదు" పలకరింపుగా విషయం తెలుసుకుందామనడిగాను.

"ఒరేయ్ సూర్యం, ఇవ్వాల్టికి సరిగ్గా పదిహేనురోజులయింది" హఠాత్తుగా అన్నాడు బాబాయ్.

"అంటే?" అడిగాను.

"అదేరా మన అమ్మలు పెళ్ళిచూపులు జరిగి పదిహేనురోజులయింది. విషయం నీకూ తెలుసుగా. మగ పెళ్ళివారికి మన సంబంధం ఎంతో నచ్చింది."

"నిశ్చయ తాంబూలాలకి ముహూర్తం పెట్టించమని వాళ్ళు ఒకటిరెండుసార్లు కబురుపెట్టారు. సరేనని మీ అమ్మని, నాన్నని కూడా ఒకరోజు ముందుగానే రమ్మని చెప్పాను. తప్పకుండా వస్తున్నామని ఫోను చేశారు.. ఆ రోజుకి మిగతా మనవాళ్ళందరూ కూడా వస్తున్నారు."



బాబాయ్ మాట్లాడటం ఆపి ఒక్కక్షణం నావైపు చూశాడు. అంతా బాగానే ఉందన్నట్టుగా తలూపాను.

"అమ్మాయి ప్రియ ఈ పెళ్ళి తనకిష్టం లేదంటోంది, ఎందుకని, మీ పిన్ని అడుగుతూనే ఉంది. కారణం చెప్పదు. ఎటూ తోచకుండా ఉంది".

"బాబాయ్, ఈ పెళ్ళి తనకు ఇష్టంలేదని ప్రియే చెప్పిందా" పూర్తిగా నమ్మకం కుదరని మనసుతో మళ్ళీ అడిగాను.

"అవునురా సూర్యం. అసలు ఈ సంబంధం గురించి, అబ్బాయి గురించి ప్రియ చెప్పటంవల్లనే మాకూ తెలిసింది. ప్రియ మాట ప్రకారంగానే పెళ్ళిచూపులు జరిగాయి."

"పెళ్ళి చూపులవగానే నిశ్చితార్థం కోసం వాళ్ళు కబురు పెట్టగానే ఒక ఆడపిల్ల తండ్రిగా నాకెంతో గర్వంగా అనిపించింది. నా కూతురు తనకు నచ్చినవాడిని చేసుకుంటాననటం, మన అమ్మాయి వాళ్ళకి నచ్చటం మన పిల్ల సభ్యత సంస్కారం వాళ్ళందరికీ ఎంతో నచ్చాయి" జరిగిపోయిన విషయాలు తలుచుకుంటూ మాట్లాడుతున్న బాబాయ్‌లో ఉరకలు వేస్తున్న ఉత్సాహం.

"అన్నీ బాగానే జరిగాయి. ప్రయోజనంలేదుగా. ఇంత అయ్యాక నేను ఈ సంబంధం చేసుకోనని మన అమ్మాయి నిష్కర్షగా చెప్పేశాక ఏమీ చెయ్యలేక చతికిలపడ్డాంగా" మా పిన్ని మాటల్లో చెప్పలేని ఆవేదన.

"ఏరా అబ్బాయి ఇప్పుడేమిటి చెయ్యటం?" బాబాయ్ అడుగుతున్నాడు. అనూహ్యమైన కష్టంలో చిక్కుకున్న ఒక ఆడపిల్ల తండ్రిగా అడుగుతున్నాడు.

ఏం మాట్లాడాలో తోచకుండా ఉంది. కాని మాట్లాడక తప్పదు.

ఇప్పుడు ఏమిటి చెయ్యటం "నిస్సహాయస్థితి" అలాగనుకుంటే సరిపోతుందా, "ఈ ఇంటి సమస్యను నిట్టూర్పుకొదిలేసి ఊరుకుంటావా?" అన్నయ్యగా ఆలోచించు- వివేకం బాధ్యతని నిర్వర్తించమని హెచ్చరిస్తోంది.

మళ్ళీ ఆలోచించాను. ఆలోచిస్తూనే ఉన్నాను.

"అన్నయ్యా, ఇతనే రామకృష్ణ. కలిసి ఒకే ఆఫీసులో పని చేస్తున్నాం. అతని మనసు చాలా మంచిది. మా ఇద్దరిమధ్యా ఆత్మీయత చోటు చేసుకుంది. రామకృష్ణని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను. ఈ ఫొటో నీ కొక్కడికే పంపించి బుజ్జమ్మగా నీ ఆశీస్సుల కోసం ఎదురుచూస్తున్నాను" ఈ పెళ్ళి విషయంలో ప్రియ నాకు రాసిన ఉత్తరం నా కళ్ళముందు కదిలింది. ఎంతో అభిమానంతో రాసిన ఉత్తరం. ప్రియని చిన్నప్పటి నుండీ 'బుజ్జమ్మా' అని అపురూపంగా పిలుస్తుంటాను. ఈ జ్ఞాపకంలోని అనుభూతి నా హృదయాన్ని మెత్తగా స్పృశించింది. ఆ క్షణం నన్ను నేనే మర్చిపోయాను.

ఒక్కసారిగా స్పందన. స్పందనలోంచి ఒక ఆలోచన.

ప్రియ ఎప్పుడూ పొరపాటు చెయ్యదు. తప్పకుండా ఇటువంటి అభిప్రాయానికి ఏదో బలమైన కారణం ఉంటుంది. ఉండి తీరాలి. నాలో ఏదో అవ్యక్తంగా కలుగుతున్న ఉద్విగ్నత.

ప్రియతో మాట్లాడాలి. విషయం తెలుసుకోవాలి. అదే ముఖ్యం.

** ** **

"అన్నయ్యా, మొహం కడుక్కునిరా, కాఫీ తీసుకొస్తాను" ఉలిక్కిపడి చూశాను. గుమ్మం దగ్గర ప్రియ నిలబడి ఉంది. హుషారుగా లేచాను.



"బుజ్జమ్మా నేను ఒస్తున్నట్టుగా నీకు ముందే తెలుసా?" కాఫీ కప్పు అందుకుంటూ అడిగాను.

"అసలు తెలియదు. ఎవరూ చెప్పలేదు కూడా" తను కూడా కాఫీ తాగుతూ మాట్లాడింది.

"ఊహించావా?" గబుక్కున అడిగాను. మాట్లాడకుండా నా వైపు చూసి కాఫీ తాగటం పూర్తి చేసింది.

"అన్నయ్యా, ప్రస్తుతం నేనున్న పరిస్థితి ఎవరికీ చెప్పుకోలేనిది. ఇలా ఎందుకు జరిగిందన్నదానికి కారణం ఎవ్వరికీ తెలియదు. చెప్పినా అర్థం చేసుకోరు, ఇప్పటికీ ఇంట్లోవాళ్ళు నేను తప్పు చేశానని అనుకుంటు న్నారు. నా మనస్తత్వం పూర్తిగా తెలిసినవాళ్ళే నన్ను అర్థం చేసుకోగల రు" మాటలు మధ్యలో ఆపి నావైపోసారి చూసింది.

"ఎవ్వరితోనూ చెప్పుకోలేని పరిస్థితుల్లో నువ్వు వస్తే బాగుండునని క్షణక్షణం నీకోసం ఎదురుచూస్తున్నాను. నేను అన్ని విషయాలు నీకు చెపుతాను" మనసులోని ఒంటరితనం పోగొట్టుకునే ప్రయత్నం ప్రియని చూస్తూ అనుకున్నాను.

"విషయం పూర్తిగా చెప్పు. అర్థం చేసుకుంటాను" కుతూహలంతో అడిగాను.

పెళ్ళిచూపులయ్యాక అతను నాతో ఒక మాట చెప్పాడు. కాని అది కేవలం మాట కాదు. పెళ్ళయ్యాక గడిపే జీవితం గురించి నిర్ణయం. అందువల్లే నేను ఒద్దన్నాను. ఇప్పట్లో ఈ పెళ్ళి ఒద్దనటమే మంచిదని పించింది.

"ఏమిటి అతని నిర్ణయం?" ప్రియ మాటలు వింటూంటే ఊహించని దేదో జరిగిందని అనుకుంటూ అడిగాను.

"పెళ్ళి చేసుకున్నాక తల్లిదండ్రులకు దూరంగా ఉండి వేరుగా కాపురం ఉండాలంటాడు. ఇది నా నిర్ణయం" అని వాదించాడు.

"మేమిద్దరం పెళ్ళి చేసుకుంటే ఇటు మనవాళ్ళు, అటు వాళ్ళవాళ్ళూ ఒకే కుటుంబంగా కలిసిపోవాలి. ఒకరినొకరు అభిమానించుకోవాలి. రెండు జీవితాల కలయికకి చక్కటి నిర్వచనం".

"మరి నీతో చెప్పకుండానే అతను నిర్ణయించుకున్నాడా?" అడిగాను.

"నా ఉద్దేశం అది కాదు. మన ఇంటికోడలు అమ్మని నాన్నని ఆప్యా యంగా చూస్తూ మెలగాలని మనం అనుకుంటాం. అలాగే వాళ్ళింటికి కోడలుగా అత్తగారితో, మామగారితో ఆత్మీయంగా కలిసిమెలిసి ఉండాల ని నా ఆలోచన."

"నేటి సమాజంలో ఉన్న ఆడపిల్లలు ఎంతమంది ఇలా ఆలోచిస్తు న్నారు? అసలు ఇలా ఆలోచించే వాతావరణం ఉందా?" ప్రియ మాట లు వింటూంటే నాలో కలిగిన సందేహం.

"ప్రియా నాకు అర్థంకాక అడుగుతున్నాను, రామకృష్ణలో ప్రత్యేకత ఏముందని నువ్వు ప్రేమించావు? ఎందుకని పెళ్ళిచూపులవరకు అవకాశ మిచ్చావు?"

నా మాటకి ప్రియ జవాబు కోసం ఆలోచిస్తోంది!

"రామకృష్ణ చెడ్డవాడు కాదు. స్వచ్ఛమైన మనసున్నవాడు. అంతేకాదు అమ్మ నాన్నలంటే గౌరవం, అభిమానం ఉన్నవాడు. ఒక ఆఫీసరై కూడా అతని జీతం పూర్తిగా వాళ్ళమ్మగారికివ్వటం అతని అలవాటు. అమ్మ గారు తనని ఎంత అపురూపంగా పెంచింది చెపుతూనే ఉంటాడు" ప్రియ మాటల్లో అతని జ్ఞాపకాలతో పాటు అనురాగం కూడా వ్యక్తమవుతుంది.

రామకృష్ణని ప్రియ పూర్తిగా అర్థం చేసుకుంది.

"అన్నయ్యా, రామకృష్ణంటే నాకెంతో అభిమానం. అందుకే అతని విషయంలో బాధ్యత తీసుకోవాలనుకుంటున్నాను. కలిసి మెలిసి ఉండే జీవితంలోని నిండుతనం అతనికి అర్థం కావాలి. జీవితంమీద అవ గాహన, స్ఫూర్తి కలిగించాలి. ఇదీ నేను చెయ్యాలి. నేనే చెయ్యాలి." అర్థవంతంగా మాట్లాడిన ప్రియని మురిపెంగా చూస్తున్నాను.

ప్రియ వ్యక్తిత్వం అనుకున్నది సాధిస్తుందా?

ఎదురుచూడాలి.

అనుభవం ఒక్కొక్కరిలో ఒక్కోరకమైన భావాలకు ప్రేరణ. ఈ భావా లు స్వభావాలను ప్రభావితం చేస్తుంటాయి.

ప్రేమించటం మనిషి లక్షణం. ప్రేమించిన మనిషిలో లోపాలు సరిది ద్దాలనుకోవటం మనసున్న ప్రేమ లక్షణం.

** ** **

ఇవ్వాళ మధ్యాహ్నం ప్రియ ఫోన్ చేసింది. నేను మా ఊరు వచ్చేసిన తరువాత ప్రియ వీలున్నప్పుడల్లా ఫోను చేసి మరీ చెపుతోంది.

"రామకృష్ణ ఇప్పుడు ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడటం లేదు. ఇక నేనూ, అతను ఆఫీసులో పని చేస్తున్న సహ ఉద్యోగులం మాత్రమే. గతంలో మధ్యాహ్నం లంచ్ ఖరీదయిన హోటలునుంచి తెప్పించేవాడు. ఇద్దరం కలిసి తినేవాళ్ళం. అతను లంచ్ కేరియర్ ఇంటినుంచి తెచ్చుకో వటం, అతనొక్కడే తినటం చేస్తున్నాడు. ఒకవిధంగా నాకు సంతోషంగా ఉంది. ఎందుకంటే నాతో లంచ్ చేసేందుకు కనీసం వంద రూపాయలు ఖర్చు పెట్టేవాడు. ప్రస్తుతం ఆ ఖర్చు లేదు. కాని అనుకోకుండా ఒక సంఘటన జరిగింది. ఆఫీసులో ఒక ఫ్రెండ్‌కి డబ్బు కావల్సి వచ్చి రామకృష్ణని సహాయం చెయ్యమన్నాడు. అందుకు రామకృష్ణ తన దగ్గర డబ్బు లేదన్నాడు. అతని ఫ్రెండ్ ఒకటికి రెండుసార్లు అడిగాడు. రామ కృష్ణ చిరాకు పడ్డాడు. వెంటనే అతని ఫ్రెండ్ "ఏంటి గురూ నేనడిగిన డబ్బు ఎంత? మీ గర్ల్‌ఫ్రెండ్‌కి తెప్పించే లంచ్ ఖర్చు కూడా కాదు. అది నీకూ తెలుసు..." అతని మాటలకి రామకృష్ణకి కోపం వచ్చేసింది.

"నువ్వు ముందు బయటికి పో" అని అరిచాడు.

ఇదంతా ఆఫీసులో జరిగింది. అంతేకాదు ఆఫీసులో వాళ్ళందరికీ తెలి సిపోయింది.

వెంటనే రామకృష్ణ లీవుపెట్టి ఇంటికెళ్ళిపోయాడు. అతను ఇంకా లీవు లోనే ఉన్నాడు. నాకెందుకో భయంగా ఉంది. రామకృష్ణకి కోపం రావ టం ఇదే మొదటిసారి. ఇంతకీ అతనికోపం ఎవరిమీద? అర్థం కావటం లేదు. ఎంతో దిగులు పడుతూ మాట్లాడింది.

** ** **

ఉదయం ఎనిమిది గంటలు. హాలులో మాట్లాడుకుంటున్న మాటలకి

"అన్నయ్యా, ప్రస్తుతం నేనున్న పరిస్థితి ఎవరికీ చెప్పుకోలేనిది. ఇలా ఎందుకు జరిగిందన్నదానికి కారణం ఎవ్వరికీ తెలియదు. చెప్పినా అర్థం చేసుకోరు, ఇప్పటికీ ఇంట్లోవాళ్ళు నేను తప్పు చేశానని అనుకుంటున్నారు. నా మనస్తత్వం పూర్తిగా తెలిసినవాళ్ళే నన్ను అర్థం చేసుకోగలరు" మాటలు మధ్యలో ఆపి నావైపోసారి చూసింది.

"ఇక్కడే మీకు ఒక నిజం, అంటే నేను గ్రహించుకున్న జీవనసత్యం చెప్పాలి. ప్రియ ప్రేమించింది నన్నేకాదు, నా జీవితాన్ని మనస్ఫూర్తిగా ప్రేమించింది. ప్రేమిస్తోంది కూడా." రామకృష్ణ మాటల్లో ప్రియపట్ల అనురాగం, ఆరాధన కలగాపులగంగా స్పష్టమవుతున్నాయి.
"ఇవన్నీ ప్రియకు తెలియాలి, తెలిసితీరాలి, కాని ఎలా?" రామకృష్ణ మాటల్లో ఆరాటం, ఆ ఆరాటంలో అమాయకత్వం.

మెలకువ వచ్చింది.

బాబాయ్ వచ్చినట్టున్నాడు. అమ్మ, నాన్నగారు మాట్లాడుతున్నారు. వెంటనే మొహం కడుక్కోవటం పూర్తిచేసి వెళ్ళి బాబాయ్‌ని పలకరించాను.

"మన అమ్మాయి ప్రియ పెళ్ళి ఒక సమస్యగా ఉంది. ఎంత చెప్పినా వినదు. చుట్టుపక్కల వాళ్ళు, రకరకాలుగా అనుకుంటున్నారు. పైగా ఇద్దరూ ఒకటే ఆఫీసులో పనిచేస్తున్నారాయె. దాంతో ఆఫీసులో కూడా ఎవరికి తోచినట్టుగా వాళ్ళనుకోవటం"

అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితిని వివరిస్తూ బాబాయ్ మాట్లాడుతుంటే అమ్మ నాన్నగారు సానుభూతి చూపిస్తున్నారు.

బాబాయ్ ఇరకాటంలో పడిన మాట నిజం.

కాని పెళ్ళి విషయంలో ప్రియ ఆలోచించుకోవటం తప్పదు. మగ పెళ్ళివారు తొందర పెడుతున్నారని మనింటి ఆడపిల్ల మెడ వంచాలని అనుకోవటం తప్పు.

ఇటు చూస్తే బాబాయ్ మనసులో బాధ, అటు చూస్తే ప్రియ మనసులో భయం.

ఆలోచిస్తూంటే అనిపిస్తోంది. ప్రస్తుతం నా ప్రమేయం ఎంతో అవసరం. నేను కల్పించుకోక తప్పదు. ఇక ఆలస్యం చెయ్యకూడదు.

హైదరాబాద్ చేరుకున్నాను.

ఉదయం పదకొండు గంటలు. ఆఫీసులో నన్ను చూడగానే ప్రియ ఆశ్చర్యం మాటల్లో చెప్పరానిది. అంతేకాదు ఎంతో సంతోషంగా మాట్లాడింది.

"ఆవేళ కూడా కూడా రామకృష్ణ ఆఫీసుకి రాలేదు" మాటల మధ్యలో ప్రియ చెప్పింది.

ఏం చెయ్యాలో ఆలోచించాను. "బుజ్జమ్మా అర్జంటు పనుంది. మళ్ళీ రాత్రికి ఇంటి దగ్గర కలుస్తాను" అని చెప్పి వెంటనే బయలుదేరాను.

వెంటనే శ్రీరామ్ దగ్గరికి వెళ్ళాలనిపించింది. నేను, శ్రీరామ్ వైజాగ్‌లో చిన్నప్పటినుండి కలిసి చదువుకున్నాం. మా ఇళ్ళు కూడా పక్కపక్కనే. సాయంకాలాలు బుజ్జమ్మ కూడా మాతో ఆడుతూ ఉండేది.

నన్ను చూడగానే శ్రీరామ్ ఆప్యాయంగా పలకరించాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో శ్రీరామ్ ఒక పెద్ద బిజినెస్ మేగ్నెట్. ఆరోజు తనకున్న ప్రోగ్రామ్స్ అన్ని పోస్ట్‌పోన్ చేసుకున్నాడు.


ఇద్దరం సరదాగా కబుర్లు చెప్పుకున్నాం. కొంచెంసేపయ్యాక నేను వచ్చిన విషయం చెప్పాను. ఏం చెయ్యదలచుకున్నానో కూడా వివరంగా చెప్పాను.

"ఒరేయ్ సూర్యం. నీ ఆలోచన సందర్భానికి తగినట్టుగా ఉంది. పోతే ఒక చిన్నమాట మనిద్దరం కలిసి వెళితే..." సరిగ్గా నాలోని ఆలోచన శ్రీరామ్ మాటల్లో వ్యక్తమయింది.

సాయంత్రం ఆరుగంటలు వేళ. ఇద్దరం కలిసి గేటు తీసుకుని ఇంటి ఆవరణలో అడుగుపెట్టాం.

రామకృష్ణని చూడగానే మమ్మల్ని మేము పరిచయం చేసుకున్నాం. అతను ఎంతో ఆదరంగా మమ్మల్ని లోపలికి తీసుకెళ్ళాడు.

డ్రాయింగ్ రూములో కూర్చున్నాం. ఈలోగా రామకృష్ణ నాన్నగారు వచ్చారు. వెంటనే ఆయనకి మమ్మల్ని పరిచయం చేశాడు. అలా వాళ్ళింటికి వెళ్ళటం వాళ్ళకి చాలా ఆనందంగా ఉంది.



"బాబూ కాఫీ తీసుకోండి" అంటూ రామకృష్ణ అమ్మగారు స్వయంగా కాఫీ తీసుకొచ్చారు. ఎందుకో నా మనసుని అనిర్వచనీయమైన అనుభూతి స్పర్శిస్తోంది. కాస్సేపు సరదాగా మాట్లాడుకున్నాం.

"సూర్యం గారూ మీ చెల్లెలు ప్రియని కలవటానికి నాకు మనసొప్పటం లేదు"

రామకృష్ణ మాటలు వినగానే వెంటనే మనసు ఉలిక్కిపడింది.

'మీ చెల్లెలు, మా అబ్బాయి ఇదివరలా తరచుగా కలుసుకోవటం లేదు" అతని తండ్రి చెప్పిన మాటలు వింటూనే శ్రీరామ్ నా భుజం మీద చెయ్యి వేశాడు. అయినా నా మనసు కంగారు పడుతూనే ఉంది.

"చూడండి ఒకవేళ మా ప్రియవల్ల ఏదైనా పొరపాటు జరిగితే" శ్రీరామ్ కల్పించుకున్నాడు. అనుకోకుండా రామకృష్ణ ఇబ్బందిగా కదిలాడు.

"ప్రియ, నేను ప్రేమించుకున్నాం. పెళ్ళిచూపులు కూడా పూర్తయ్యాయి. ప్రియని సంతోషపెట్టటానికి ఎన్నో చేస్తూండేవాడిని. ఎంత డబ్బయినా ఖర్చు పెడుతూండేవాడిని. కాని ఇలాంటి సరదాలను ప్రియ ఇష్టపడేది కాదు. మా సరదాలకు, సంతోషాలకు డబ్బుకోసం మా అమ్మని ఇబ్బంది పెడుతూండేవాడిని. ఇది నా సంపాదన. నేను అడిగినప్పుడల్లా డబ్బు ఇచ్చితీరాలని తరుచుగా ఇంట్లో మాఅమ్మతో తగువు పెట్టుకునేవాడిని... పెళ్ళయ్యాక కూడా ఇలాగే ఉండాలని వేరేగా కాపురం పెడదాం, ఎందుకంటే డబ్బుల విషయంలో గొడవ పడటం నాకు చిన్నతనం" ఈ మాట ప్రియతో చెప్పాను.

"నా ఆలోచనలు ప్రియకు నచ్చలేదు. ఇటువంటి జీవితం తనకొద్దని నిర్మొహమాటంగా చెప్పింది. అందుకు నేనెంతో అవమానంగా ఫీలయ్యాను."

రామకృష్ణ మాట్లాడుతూంటే మగవాడి స్వగతం అర్థమవుతోంది! "ప్రియతో కలిసిమెలిసి తిరగాలంటే డబ్బుకోసం అమ్మతో తగవు! అసలు డబ్బు ఖర్చు లేకుండా ఉంటే "ఆలోచించాను! నన్ను నేను నిగ్రహించుకున్నాను! హోటల్లో టిఫిన్ తిన్నా, కనీసం కాఫీ తాగినా ప్రియ లేని లోటు నన్ను బాధపెట్టటం ప్రారంభించింది. అందుకే ఇవన్నీ మానేశాను. ఎన్ని సాయంత్రాలు నేను, ప్రియ కలిసి గడిపాం. ఇప్పుడు ప్రియ నాతో రాదు. అందుకే ఆఫీసునుంచి తిన్నగా ఇంటికొచ్చేయటం అలవాటు చేసుకున్నాను. ఇప్పుడు నాకు ఎటువంటి బాధలూ లేవు. ఎలాంటి తాపత్రయాలు లేవు. నన్ను చూసి మా అమ్మా నాన్న ఎంతగానో సంతోషిస్తున్నారు."

ఈ మాటలంటున్న రామకృష్ణని వాళ్ళ అమ్మ నాన్నగారు అతన్ని చూస్తున్నారు. ఆ క్షణంలో ఆ చూపులెంతో అపురూపం.

"ఇటువంటి సంతోషాన్నా నేను ఒదులుకుందామనుకున్నాను" అని ఇపుడనుకుంటూంటే నాకెంతో సిగ్గుగా ఉంది." ఒక చక్కటి జీవితం తన చెయ్యి జారిపోకుండా జాగ్రత్తపడినందుకు రామకృష్ణని మనస్ఫూర్తిగా అభినందించాం.

"ఇక్కడే మీకు ఒక నిజం, అంటే నేను గ్రహించుకున్న జీవనసత్యం చెప్పాలి. ప్రియ ప్రేమించింది నన్నేకాదు, నా జీవితాన్ని మనస్ఫూర్తిగా ప్రేమించింది. ప్రేమిస్తోంది కూడా." రామకృష్ణ మాటల్లో ప్రియపట్ల అనురాగం, ఆరాధన కలగాపులగంగా స్పష్టమవుతున్నాయి.

"ఇవన్నీ ప్రియకు తెలియాలి, తెలిసితీరాలి, కాని ఎలా?" రామకృష్ణ మాటల్లో ఆరాటం, ఆ ఆరాటంలో అమాయకత్వం.

"నిశ్చయార్థానికి మీరు కబురుపెట్టినా మీ తరపు నుండి..." శ్రీరామ్ మాట్లాడబోయాడు.

"మీ పరిస్థితిని మేము అర్థం చేసుకున్నాం మరేం ఫరవాలేదు" రామకృష్ణ తండ్రి మనసులోంచి వచ్చినమాట.

"చూడండి బాబూ, "పెళ్ళి" అంటే అమ్మాయి తాళి కట్టించుకోవడమూ, అబ్బాయ్ తాళి కట్టేయటం కాదు. మగవాడికైనా ఆడపిల్లకయినా భవిష్యత్తుకి సంబంధించింది" అతని తల్లి మాటలు!

"వివాహం చేసుకున్నాక భార్యభర్తలిద్దరికీ మధ్య ఎన్నో అభిప్రాయాలు,

మరెన్నో ఆలోచనలు. వీటన్నింటిని ఒకొరినొకరు అర్థం చేసుకోవాలి. నిజానికి ఇద్దరికీ రెండో జీవితం. నా అంచనా ప్రకారం ప్రియ ఆలోచన సరిగానే ఉంది"

నేను, శ్రీరామ్ అప్రయత్నంగా ఒకరినొకరం చూసుకున్నాం.

"ప్రేమకి నిర్వచనం మనుషుల స్వభావాలకు వ్యక్తిత్వాలకు సంబంధించినది. మీ చెల్లెలు సాహచర్యం వలన మా రామకృష్ణ తనలోని లోపాలని తెలుసుకోగలిగాడు" రామకృష్ణ తండ్రి అలా మాట్లాడటానికి ఏమాత్రం వెనుకాడకపోవటం మాకు ఆశ్చర్యం కలిగేటట్టు చేసింది.

"సూర్యం గారూ, ప్రియ సాహచర్యంలో అభిమానముంది. అంతకంటే ఎక్కువగా బాధ్యత ఉంది. పైగా నిజమైన స్నేహం ప్రియ ప్రవర్తన వల్లే నేను తెలుసుకోగలిగాను" మనసులో భావాలు స్వచ్ఛంగా వ్యక్తం చేస్తున్న రామకృష్ణ నిశితమైన వ్యక్తిత్వం.

ఇటు తల్లిదండ్రుల సంస్కారం, అటు కొడుకు ఔన్నత్యం. అలా మాట్లాడటానికి హృదయంలో అంతఃకరణ ఉండాలి. ప్రస్తుతం వాళ్ళలో మాకు అదే కనిపిస్తోంది.

"మనం ఇష్టపడే వ్యక్తి అర్థం చేసుకునేవిధం. గా జాగ్రత్తగా ప్రవర్తించి వాళ్ళలో లోపాల్ని సరిదిద్దటమంటే ఎంతో ఓర్పు, సమయస్ఫూర్తి ఉండాలి. అదే నిజమైన ప్రేమ. ప్రేమకు హక్కులకంటే బాధ్యతలు ముఖ్యం."

"మీవల్ల ఆలస్యం జరిగిందని మేము అనుకోవటం లేదు. ఇవ్వాళ మీరిద్దరూ మా ఇంటికి రావటంవల్ల రెండు కుటుంబాలమధ్య అవగాహన కలిగింది. ప్రియతో మాట్లాడి అమ్మాయి ఇష్టప్రకారంగా తాంబూలాలు పుచ్చుకుందాం."

రామకృష్ణ తల్లిదండ్రుల అభిప్రాయానికి మా మనస్సులో కృతజ్ఞత.

వాతావరణం ఉత్సాహంగానూ, ఉల్లాసంగా ఉంది. పెళ్ళిసందడి. అక్కడున్న వాళ్ళంతా పెళ్ళిపనులతో హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

** ** **

"మనసుని గుప్పెట్లో ఉంచుకుంటే ఒడిదుడుకులు లేని మనుగడ మన సొంతమవుతుంది! ప్రతీ ఆడపిల్ల ఇలాగే ఆలోచిస్తే ఎంత బావుంటుంది" ప్రియని చూస్తూ శ్రీరామ్ అంటున్న మాటలు.

"మనం అనవసరంగా ఏవేవో అనుకున్నాం. కాని మన ప్రియ పట్టుదలతో తను అనుకున్నది చేసి మరీ చూపించింది"పెళ్ళికొచ్చిన ఆఫీసు వాళ్ళందరూ అనుకుంటున్నారు.

"మమతల పందిట్లో తియ్యటి అనుభూతులతో ముస్తాబయిన వాళ్ళిద్దరి రెండో జీవితం నిత్యవసంతంతో కళకళలాడాలి" అక్షింతలకు నాలో కలిగిన భావాలను సంతరింపచేసి ప్రియ రామకృష్ణలను వాత్సల్యంతో ఆశీర్వదిస్తూంటే కళ్ళు చెమ్మగిల్లాయి.

# తన్వీ!



రహస్యం వాళ్ళ జీవితం
రహస్యం వాళ్ళ సౌందర్యం
రహస్యం వాళ్ళ రక్త ప్రసరణం

రహస్యాన్ని రహస్యంగా
ఉంచటంలో విజయులయినవాళ్ళు
రహస్య రసాధి దేవతలు.

దేన్ని దాచి పెట్టాలో
దేన్ని విడిచి పెట్టాలో
వాళ్ళకు బాగా తెల్సు.

దాచిపెట్టిన దాన్ని విడిచి పెట్టటంలో
విడిచిపెట్టిన దాన్ని దాచిపెట్టటంలో
శిల్ప కళా రహస్యం తెలిసినవాళ్ళు.

సరస్సులుంటాయి, సముద్రాలుంటాయి
అన్నీ రహస్యాంతర్భాగాలలోనే
కాననాలుంటాయి, కంటకావృత దారులుంటాయి
వనాలుంటాయి, దేవతలు తోటమాలులై
చెట్లకు నీళ్ళు పోసే ఉద్యానవనాలుంటాయి,
అన్నీ, అంతరంతరాళాల రహస్య గోళాల
పరిభ్రమణంలోనే-

పెదవి నుంచి ఒక్క మాట రాలదు
పొరపాటున నయన సింహద్వారం వద్ద
ఒక్క అశ్రుబిందువు తొంగి చూస్తే
ఒక్క దరహాసరేఖతో దాన్ని తుడిచేసి
సప్తస్వరాల సవ్వడుల మీద తేలిపోతారు

** ** **

బంగారపు పోగుల్లేని
నీ చెవి బెజ్జంలో ఓ వేపుల్లనయితే
బంగారపు గాజుల్లేని
నీ వట్టి చేతులకు, యింద్రధనుస్సులాంటి
మట్టి గాజులనయితే

ఎవ్వరూ చూడకుండా
కళ్ళు తుడుచుకునే
నీ కడ కొంగునయితే

తన్వీ!
నీ రహస్యంలో నన్నొక రహస్యం చేసి
నీ అంతరంగ అక్షరమాలలో
నన్నొక అచ్చును చెయ్యి.

– శివారెడ్డి

